# ★ రాగ జ్యోతి ★

"విహారి"

"అమృతమే మన స్నేహం, మధురామృతమే మన స్నేహం.... అమృతమే మన స్నేహం." పాట, మాటకు తగినట్లు అంతటితో ఆపి మ్యూజిక్‌లాగా ఈల వేసుకుంటూ ఒక్కడుగులో గదిలో ప్రవేశించాడు రాజు.

గుమ్మంలో నిలబడి, "ప్రసాద్ యీ రోజుతో మన దరిద్రం వదిలిపోయింది. ఇక వాకశే ఆనందం" అన్నాడే కాని, ఆ ఆనందం బయటపడలేదు. ప్రసాద్ వున్న పరిస్థితికి విచారించి

తుంగ చాపమీద బోర్లగిలా పడుకుని గడ్డంక్రింద అరచేతు లానించి, దిండుమీద మోచేతులు పెట్టి విషణ్ణ వదనంతో వున్న ప్రసాద్‌నిచూసి రాజు నొచ్చుకున్నాడు.

రాజు హృదయ జలధిలో ఆనందోత్తుంగ తరంగాలు పొంగి పొరలు తున్నాయ్. పరలోకంలో నరకమనే దానిసంగతి తెలియదు గాని, యిహ లోకంలో, అందునా బీద, బడుగుదేశమైన మనదేశంలో, దాని సాటిదైన నిరుద్యోగబాధ తొలగిన శుభసమయంలో ఆనందం కలగటం సహజమే గదా! అంతటి అసాధారణ ఆనందాన్ని మిత్రుడికి చెప్పాలని వుత్సాహంతో వస్తే నిరుత్సాహం ఎదురైంది. ముఖం చిన్నబుచ్చుకుని, లోపలికెళ్ళి కుర్చీలో కూర్చున్నాడు రాజు.

"ఓ రాజూ.... వచ్చావా.... ఏమైంది వెళ్ళిన పని?" రాజు మాటలకు ఏదో సుషుప్తావస్థలో నుంచి తేరుకుని ప్రశ్నించాడు ప్రసాద్.

"అ మూర్తీ అండ్ కో వాళ్ళు ఉద్యోగమిచ్చారు. రేపే జాయిన్ కమ్మన్నారు" రాజు ముక్తసరిగా జవాబిచ్చి ప్రక్కట్రంకుమీది ప్రతిక తీశాడు చేత్తో

"వెరీ గ్లాడ్ హార్దికంగ్రాట్యులేషన్స్.... చెప్పవేరా మరి" అని లేచి, అమాంతం రాజుమీద వాలాడు ప్రసాద్.

"ఓరే.... హారేయ్.... ఆగరా.... ఆడవాళ్ళలాగా ఏమిటాయిది?"

"ఆడపిల్లవైనా బాగుండేదిరా.... మీ వాళ్ళు సహాయపడే వాణ్ణి" అన్నాడు ప్రసాద్.

ఇద్దరి నవ్వులతో ప్రతి ధ్వనించిందిగది. షెల్ఫ్‌లోని చక్రకేళీ పళ్ళను ముక్కులతో పొడుస్తూ, రెక్కలు విదల్చినయ్ రెండు పిచ్చుకలు.

## ప్రచురణకు స్వీకరించిన పోటీ కథానిక

"అలా కాసేపు తిరిగొద్దాం పదరా..." అన్నాడు రాజు, ప్రసాద్‌కు కలిగిన సంతోషాన్ని మళ్ళీ పారిపోకుండా చేయాలని.

"చిత్తం...." చిత్తం.... దొరగారి ఆజ్ఞ" అన్నాడు ప్రసాద్, చిరునవ్వు నవ్వుతూ.

"ఏరోయ్. మొదలు పెట్టావే నువ్వాను కాకారాయుడివౌతున్నట్లుందే"

"కాలానికి యెదురీదలేమురా నలుగురితోపాటు నారాయణా. నీకూ తెలుస్తుందిలే. కొద్ది రోజుల్లో" అంటూ ముఖం కడుక్కోటానికి వెళ్ళాడు ప్రసాద్.

## 2

ప్రపంచంలోని అనేక విషాద గీతాల్ని, వ్యథాపూరిత నాటికల్ని, పదిగంటలపాటు తిలకించి, హృదయం ద్రవించి యిక చాలన్నట్లు పడమటి కొండల చాటుకు పోతున్నాడు సూర్యుడు "నేనూ మీకు మిత్రుణ్ణే. తర్వాత గాథ నేనాలకిస్తాను, కానీయండి' అని బోతున్నాడు చంద్రుడు. పడమటి దిక్కు కోపించిన పడతిముఖంలాగా జేగురుంచి కృష్ణనీటిని భయపెట్టిస్నది. పెళ్ళికూతురులా ఝల్లనల్లన ప్రశాంత పయనాలు సాగిస్తున్నది కన్నబెన్నా!

ఒడ్డున ఇసుకలో కూర్చున్నారు రాజు ప్రసాద్.

చేతిలో త్రిప్పుతున్న కంకర రాయిని నీటిలోకి విసిరాడు ప్రసాద్. బుడుంగుమని నాలుగు నీటిబొట్లు పైకెగసి క్రింద పడినయ్. ప్రశాంతంగా వున్న నీళ్ళు వలయాల రూపంలో తిరిగినయ్. ప్రసాద్ మనస్సులో ఆలోచనల సుళ్ళు తిరుగుతున్నయ్ భరించరాని బాధయేదో అతన్ని పీడిస్తున్నది తెగని సమస్యలేవో తేనెటీగలై ముసురుకుంటున్నా యతన్ని.

ప్రసాద్ వ్యథ రాజుకు అర్థమైంది. మౌనంగా వున్నకొద్దీ ఆలోచనలు యెక్కువౌతవని ప్రసాద్" అంటూ నెమ్మదిగా పిల్చాడు.

"ఊఁ"

"ఏమిటాలోచిస్తున్నావ్? మీ అరుణ గురించేనా..."

ప్రసాద్ తల ప్రక్కకు త్రిప్పి రాజు కళ్ళల్లోకి చూశాడు. అమాయకత్వం. నైర్మల్యం తప్ప మరేమీ గోచరించని ఆ చూపులకు తట్టుకోలేక తలదించుకున్నాడు ప్రసాద్

"ప్రసాద్.... నా కంటే నీకీ లోకంలో ఆప్తులనే వాళ్ళెవరైనా వున్నారా?" ఊహల్ని, పటాపంచలు చేస్తూ అడిగాడు గాడు రాజు (సూటిగా)

"లేరు ఒక్క అరుణ తప్ప"

"ఆ అరుణ యిప్పుడు లేదు. ఇక వున్నది నేనే గదా? మరి నాకు కూడా చెప్పవా నీ బాధ.... మ్రింగుడు పడని

గరళాన్ని కంఠంలో పెట్టుకుని యెలా భరిస్తావ్? బ్రద్దలు కాబోతున్న అగ్ని పర్వతాన్ని గుండెల్లో పెట్టుకుని యెలా సహిస్తావ్?... నీకు శాంతి సౌఖ్యాలు లేకుండా, నీ హృదయంలో యీ జ్వాల రగిల్చిన ఆ అరుణ యెవరు? చెప్పు ప్రసాద్ చెప్పు" ఆవేశంగా ప్రశ్నించాడు రాజు, గుప్పెట్లోని యిసుక క్రింద కుమ్మరిస్తూ.

"సినిమాలో కథానాయకుడిలా అడిగావ్ రాజూ...." అని పేలవంగానవ్వి "అదిగో.. అలా ఆ పశ్చిమ దిశని చూడు రాజూ.... అచ్చు ఆ అరుణిమలాగానే వుండేది మా అరుణకూడా. బంగారు వన్నెల్లో అందం వుందంటారుగానీ, కొద్ది యెఱుపు వర్ణం కూడా మేనికి శోభనిస్తుంది రాజూ.... ఎఱుపూ పసుపూ కాని దేహ కాంతితో, చకోర్లాంటి కళ్ళతో. పెదవుల కదలని చిరునవ్వుతో, లేడిలా తిరిగే అరుణ.... యికలేదు........" కళ్ళల్లో తిరిగిన నీళ్ళు, ప్రసాద్ మాటల్ని గాద్గదికం చేసినయ్. క్రింది పెదవిని పళ్ళతో నొక్కిపట్టి, కుడి చేత్తో కన్నీళ్ళు తుడుచుకుంటూన్న ప్రసాద్‌ని చూసి రాజుకు జాలికలిగింది.

మనోవ్యధతో తపించిపోయే వ్యక్తిని అదే విషయాన్ని గురించి ప్రశ్నిస్తే బాధ ఎక్కువకావటం కొందరికి సహజం 'ఏదో కులాసాగా గాలిపీల్చుకోవటానికివచ్చి యీ ప్రశ్నలెందుకు లెమ్మని మౌనం వహించాడు రాజు. కొద్దిగా ప్రక్కకు జరిగి మోకాళ్ళకు రెండుచేతులూచుట్టి దూరంగా వున్న రైలు బ్రిడ్జిని చూస్తూ కూర్చున్నాడు ఏదో రైలు బ్రిడ్జిని దడదడలాడిస్తూ దక్షిణానికి వెళ్తున్నది. రాజు ఆలోచనలు గతంలోకి వెళ్తున్నయ్............

"ప్రసాద్, తను ప్రాణసమానం వొకరికొకరు. అమృతం లాంటిది తమస్నేహం. ఆసలు తమస్నేహం కలవటమే చిత్రంగా కలిసింది. కాలేజీలో చేరిన మొదట్లో తనకేదో భయం భయంగా వుండేది. అప్పటి వరకూ హైస్కూలు వాతావరణంలో మెలిగి వచ్చిన తనకు కాలేజీ వాతావరణం క్రొత్త అనిపించేది. ఎవరెటుచూసినా తననే చూస్తున్నారనిపించేది. తోటివాళ్ళందర్లో ఏదో యిన్ఫీరియారిటీ ఫీలయ్యేవాడు తను. ఒక నాడు.... బాస్కెట్ బాల్ మాచ్ జరుగుతున్న దంటే గ్రౌండ్స్‌లో కెళ్ళాడు. ఎవరినోట విన్నా ప్రసాద్ మాటే. బ్రహ్మాండంగా ఆడతాడంటే బ్రహ్మాండంగా ఆడతాడని తెగమెచ్చుకుంటున్నారు విద్యార్థులు. ఎదుటి పక్షంవాళ్ళ ఎన్నిపాయింట్లో తెచ్చుకున్నా ప్రసాద్‌వాళ్ళపక్షం ఒక్కపాయింటుకూడా చేయలేకపోయింది. పైగా రెండు మూడు సార్లు చేజిక్కిన అవకాశాన్ని చెడగొట్టాడు ప్రసాద్ చాలా కోపమొచ్చింది తనకు.... "డౌన్ డౌన్ ప్రసాద్.... ఇన్సల్ట్.... ఇన్సల్ట్...." అని పెదగా అరిచాడు తను. ఎలా అన్నాడో తెలీదు తనకే.... ప్రేక్షకుల్లో కలకలం చెలరేగింది...ఆటమధ్యలో నుంచి తన దగ్గరు కొచ్చాడు ప్రసాద్. "నువ్వొచ్చి పాయింట్లు సంపాదించి చూపు నాయనా?" అని చెయి పట్టుకు గుంజాడు తనని తనకు నోట మాట రాకపోగా, శరీరం చలవలు క్రమ్మింది. తమాయించుకుని కోర్టులో కెళ్ళాడు తను. ఎదుటి పక్షంవాళ్ళు వీల్లేదన్నారు. ప్రసాద్ తన టీమ్ వోడిపోయినట్లు వొప్పుకుని అప్పుడిక తన నాడమన్నాడు. అంతే. తనలోని ఏదోశక్తి విజృంభించి, అద్భుత ప్రజ్ఞతో ఆటాడించింది. ప్రసాద్ మెచ్చుకున్నాడు. అభినందించాడు. రూమ్‌కు తీసుకెళ్ళి తన రూమ్‌లోనే వుండమన్నాడు. అతని సహృదయతకూ, కలుపుగోలుతనానికి చాలా ఆశ్చర్యపడ్డాడు తను. ఆనాటినుంచీ కాలరథం నాలుగుమైలురాళ్ళు దాటినా ఆ రూమూ, తమ స్నేహంమాత్రం అలాగే వున్నయ్."

ప్రసాద్ తండ్రి అతని చిన్న తనంలోనే పోయాడు పెద్దగా కలిగిన కుటుంబం కాకపోయినా, వున్న కొద్ది పొలంలో జాగ్రత్తగా రోజులు వెళ్ళబుచ్చుతూ, తన కోరికకు తోడు తల్లి ప్రోద్బలంతో కాలేజీలో చేరాడు. వచ్చేది తక్కువైనా, పొదుపుగా గడుపుకుంటూ చదివాడు బియ్యే వరకూ. పల్లెటూల్లో కొడుకుమీద కొండంత ఆశపెట్టుకుని, విజయవాడలో చదివే ప్రసాద్‌కు డబ్బు పంపుతూ వుండేది అతని తల్లి. చదువులకోసంవున్న కాస్తభూమి హరించుకుపోవటం, దానితో పాటే ఆమె శరీరంలో పటుత్వంకూడా హరించుకు పోవటంతో, అతను బియ్యే చివరి సంవత్సరం చదువుతుండగా తల్లి కాలం చేసింది. తల్లి పోయిన బాధతో చదువుమీద శ్రద్ధ చూపలేకపోయాడు ప్రసాద్ చదువు మానేస్తానని పట్టుపడ్తే, రాజే ఆ ప్రయత్నాన్ని విరమింపజేసాడు. పండి నోటికొస్తున్న ఫలాన్ని జార విడవటం మంచిదికాదని, వున్న ఆస్థంతా కరగించి నాలుగేళ్ళపడ్డ శ్రమకు ఫలితముండదనీ, యెన్నో విధాల నచ్చ చెప్పి ప్రసాద్‌ను కష్టాల్లో ఆదుకున్నాడు రాజు. జూలా ఉత్సాహ ప్రోత్సాహాల్తో బియ్యే ప్యాసై, విజయవాడలోనే ఉద్యోగంలో చేరాడు ప్రసాద్. రాజుకూడా కొద్దిగా కలిగిన కుటుంబంలో పుట్టినా, చదువు పూర్తిచేసి ఉద్యోగం చేయటం తప్పనిసరి కావటంతో, యీ మూర్తి అండ్ కోలో యిప్పటికి వుద్యోగం సంపాదించాల్సొచింది.

ప్రాణాధికంగా అభిమానించుకొని పెంచుకొన్న స్నేహంతో వారు వొకరి కొకరు గురువుగా స్థిరపడ్డారు. రాజుకు తెలిసిన విషయాలు ప్రసాద్‌కు తెలిసేవి. ప్రసాద్‌కు తెలిసిన సమస్తం రాజు కవగతమయ్యేది. మనస్పర్థలంటే యేమిటో తెలియకుండా గడిచినయ్ రోజులు, ఐదేళ్ళ సాహచర్యం వాళ్ళలో స్నేహాన్నిమించిన వొక ఆప్యాయతనూ, బంధుత్వాన్నీ యేర్పరించింది. చివరకు వొకరి నొకరు విడచి వుండలేని స్థితికి దిగారు యిద్దరూ.

ఇంత ప్రాణ స్నేహితులైనా, ప్రసాద్ తన యీ వొక్క బాధను గురించి రాజుకు చెప్పేవాడు కాదు. ఎన్ని సార్లు ఆ విషయాన్ని గురించి అడిగినా "అరుణను మళ్ళీ చూడలేనుగదా...." అని దుఃఖించడంకన్నా వివరాలు చెప్పేవాడు కాదు. ఇక యీ విషయాన్ని మాట్లాడ

కూడదని నిర్ణయించుకొనేవాడు రాజు. కాని ప్రసాద్ పడుతున్న మనోవ్యథను యెలా తప్పించటమా" అనీ, "అతని మనస్సు నుండి ఆ బాధను పోగొట్టలేక పోతున్నానే" అనీ విచారిస్తూనే వున్నాడు రాజు. అదే అతనికి సాధ్యం కావటంలేదు,

"వెళ్దామా రాజూ" అన్నాడు ప్రసాద్ లేస్తూ.

"ఊఁ" అంటూ అతన్ననుసరించాడు రాజు.

విద్యుద్దీప కాంతిలో విజయవాడ నగరం వింత శోభని కూర్చుకుంది. హడావిడిగా జరిగే జనసంచారంతో రోడ్లన్నీ కోలాహలంగా వున్నయ్ ఆంధ్రదేశంలోని దైన్యం, ఆనందం; దారిద్ర్యం, సౌభాగ్యాలను సమపాళ్ళలో రంగరించుకొని రంగు కూర్చుకున్న విజయవాడ నగరం, రాజు, ప్రసాద్‌లవంటి లక్షలాది వ్యక్తుల మనస్తత్వాలకు తార్కాణం! వాళ్ళిద్దరూ ముందుకు సాగుతున్నట్లు ఈ నగరమూ సాగుతూనే వుంది!

## 3

"అమూల్యంగా చూసుకున్న రత్నం చెయి జారిపోతే యెలా వుంటుంది రాజూ?"

లోకంపై అమృతవర్షం కురిపిస్తున్న చంద్రుడు తారకల్తో దోబూచులాడుకుంటూంటే చూస్తూ, ఏదో అనిర్వచనీయమైన మధురానుభూతులతో మునిగి తేలుతున్న, రాజు స్వాప్నిక దృష్టిని మరల్చింది యీ ప్రశ్న.

"ఎలా వున్నప్పటికీ చెయి జారినది తిరిగి రాదుకదా, దాని కోసం తపించి చేయగలిగిందేముంది?" యధాలాపంగా అన్నాడు రాజు.

"తిరిగి వచ్చినా రాకపోయినా, చేయగలిగిందేమీ లేకపోయినా, ఆ బాధ పడకుండా వుండలేం రాజూ. నీకా సంగతి తెలీదు. నాకా విషయం తలపుకొస్తే హృదయం బ్రద్దలౌతుంది...." బాధగా అన్నాడు ప్రసాద్. రాజు మౌనం వహించాడు. ఒక్క క్షణంతర్వాత ప్రసాదే అన్నాడు. "రాజూ మా అరుణ సంగతి చెప్తా విను...." అని.

రాజు ఆశ్చర్యపోయాడు. ప్రసాద్ తనంత తాను అరుణ విషయం చెప్తాననటంతో, ఉత్సుకతని ప్రకటిస్తూ మంచం మీద లేచి కాళ్ళు రెండూ ఆడిస్తూ, చేతులు వెనక్కానించి వంగి కూర్చున్నాడు.

దీర్ఘంగా నిట్టూర్చి మొదలు పెట్టాడు ప్రసాద్.

'రక్తసంబంధంకంటే అనురాగబంధమే గొప్పదంటే, అదేదో చిన్న విషయంగా తీసిపారేసే వాణ్ణి నేను. కానీ యీ నాటికి నాకు తెలిసింది దాని విలువ. నీ స్నేహం వలనా, మా అరుణ దూరం కావటంవలనా. మా వూళ్ళో మా యింటి ప్రక్కగా వుండే వాళ్ళు అరుణావాళ్ళు. అప్పట్లో గొప్పగా కాకపోయినా, కాస్తో కూస్తో వున్న, వాళ్ళుగానే పరిగణింపబడే కుటుంబం మాది. అరుణ తండ్రి, వున్న యెకరం పొలం, వూళ్ళో భూస్వాముల భూమి కొంత, కౌలు చేసుకుని బ్రతుకుతూ వుండేవాడు. అరుణ వాళ్ళకి వొక్కగా నొక్క కూతురు. లోకంలో తోడులేకుండా జన్మించిన వొంటరి వాళ్ళకి అచ్చటా ముచ్చటలు జాస్తిగా జరుగుతాయంటారు. కాని, అరుణ ఆ భాగ్యానికి నోచుకోలేకపోయింది. నిండా పదేళ్ళు నిండకపోయినా, యింటెడు చాకిరీచేసి బండబారిపోయినయ్ ఆమె చేతులు. దీనికంతకూ కారణం వాళ్ళ నాన్న అశ్రద్ధ; సవతి తల్లి ఈర్ష్య. పాపం అరుణ పుట్టంగానే 'తల్లిని చంపిన దయ్యం' అయింది ఇంట్లో వాళ్ళకీ, వూళ్ళో వాళ్ళకి. పడిన శ్రమనంతా మరచిపోయి, తీరిక చేసుకుని వచ్చి నా దగ్గర పాఠాలు చదువుకొనేది. మాతృప్రేమకు నోచుకోని ఆ చిన్ని హృదయానికి, మా అమ్మ ఆప్యాయత అమృత ప్రాయమైంది. దానితో యెడతెగని వాత్సల్యానుబంధమేదో పెనవేసుకుపోయింది మాకూ అరుణకూ మధ్య. అరుణ లేత హృదయానికి మరో దెబ్బ తగిలింది ఆ సమయంలోనే. కాలప్రవాహంలో కొట్టుకుపోయే గడ్డిపోచలెన్నో! వాటిని ఆపగలమా? శరీర రుగ్మతతో అరుణ తండ్రి మరణించాడు. ఆనాటి నుంచి ఆమె జీవితంలో పెనుతుఫాను చెలరేగింది."

'భర్త మరణంతో సవతి తల్లి అధికారం అధికమైంది. అరుణను అష్టకష్టాలూ పెట్టేది ఆవిడ. సవతి తల్లి హృదయమంత కాఠిన్యమని పుస్తకాల్లో వ్రాయటమే గాని, అది అసంభవమనే నా మూఢ నమ్మకం, మా అరుణ కష్టాలు, ఆమె పడే బాధ చూసి మారిపోయింది. తల్లి లేని అరుణకు మా అమ్మే తల్లిలా వోదారుస్తూ వుండేది. రెండు సంవత్సరాలు దుర్భరంగా గడిచినయ్. ఈ రెండేళ్ళలో మా కుటుంబం ఆర్థికంగా వొడుదుడుకులకు లోనైంది హఠాత్తుగా వొకరోజు ఉదయం వూళ్ళో ఎవరినోట విన్నా అరుణ పారిపోయిందనే అలజడి బయల్దేరింది. రాత్రి యెనిమిది గంటలదాకా నా దగ్గర కూర్చుని పాఠాలు చెప్పించుకున్న అరుణ తెల్లవారేసరికి లేదు. నా గుండె గుబ గుబలాడింది మా అమ్మ మనస్సు అనేక చెడులను శంకించింది. ఊహ తెలిసినప్పట్నుంచి మాలో వొకతై, మా హృదయాలను ఆనంద పరచిన మా అరుణ అదృశ్యం కావటం నన్నూ కలచివేసింది. గుండె నిబ్బరం చేసుకుని, ఆ రోజంతా వూరు. పరిసరాలూ, మారుమూలలన్నీ వెతికాను. కాని ఫలితం శూన్యం. మరునాటినుంచి కొన్ని నెలలు మా అరుణకోసం దగ్గరలో వున్నవూళ్ళు, వాళ్ళ దూరపు బంధువుల యిళ్ళతోసహా గాలించి చూశాం. కాని అరుణ కనపడలేదు. విరక్తితో ఆమె లేత హృదయం ఏ అఘాయిత్యానికో తలపడి వుంటుందని నిశ్చయం చేశారు పెద్దలంతా. నేను ఏ నిర్ణయానికీ రాలేక సందిగ్ధావస్థలో యిప్పటివరకూ అలాగే వున్నాను. కాని ఆమె రూపం నా హృదయ ఫలకంమీద చెరగని ముద్ర వేసింది. ఆమె అమాయకత్వం, మంచిదనం నా జీవితంలో యింకెరిలో చూడలేను. ఈ సరికి పదహారేళ్ళు నిండి వుండేవి. ఆ ని వొ క లి ప్త కా లం

ఆపి "అరుణ ఆ విధంగా అదృశ్యమైనా ఇంతకా ఆమెను మరచిపోలేకపోతున్నాను" అంటూ నిట్టూర్పుతో ముగించాడు ప్రసాద్.

రాజు మనస్సు నీరైంది. బాధగా వూపిరి పీల్చుకుని, "అయితే ప్రసాద్, అరుణంటే అంతటి ప్రేమగల్గిన నీ మీద అరుణకూ అలాంటి అనురాగమే వుండాలి గదా...." యధాలాపంగా అడిగాడు.

"ఉఁ" అని పరాధ్యానంగా అన్నాడు ప్రసాద్.

4

తూర్పున తెల్లవారి బారెడు పొద్దెక్కింది. దిన చర్యకు వుపక్రమించింది ప్రాణికోటి. రాజు, ప్రసాద్, పేవ్‌మెంటు మీద నడుస్తున్నారు.

"ప్రసాద్, మనం యిప్పుడెక్కడికి పోతున్నామో తెలుసా ?" మౌనాన్ని భంగపరుస్తూ అడిగాడు రాజు.

"ఎవరింటికో పనుండి వెళ్తున్నాను, నువ్వూరా, అన్నావు. నేవస్తున్నాను మళ్ళీ నన్నే ప్రశ్నిస్తావేం ?" విసుగ్గా అన్నాడు ప్రసాద్.

"అది కాదు ప్రసాద్. నేను వాళ్ళింటికి వెళ్దామని బయలేర్దాను. ఉద్యోగం విషయం మాట్లాడుదామని...." అర్ధోక్తిగా గోళ్ళు గిల్లుకుంటూ తలవంచుకొని చెప్పాడు రాజు.

రాజు ముఖకవళికల్ని పరీక్షిస్తూ "ఎవరింటికి ?" అని అర్థంకానట్లు అడిగాడు ప్రసాద్.

అదే.... మా కుమారీ వాళ్ళింటికి...." అని ప్రసాద్ కళ్ళల్లోకి చూశాడు రాజు.

"ఓహో" అని "అయితే నేనెందుకూ అక్కడికి. నేను రూమ్‌కి వెళ్తాలే" అన్నాడు ప్రసాద్.

"కాదు, నువ్వీ రోజు ఆమెను చూసి, వాళ్ళమ్మతో మాట్లాడాలి మా విషయం" నీళ్ళు నమిలాడు రాజు.

ప్రసాద్ మరేమీ మాట్లాడకుండా నడక సాగించాడు. రాజు కుమారి అనే అమ్మాయిని ప్రేమించాడని ప్రసాద్‌కు తెలుసు. రాజే యీ విషయం అతనికి చెప్పి, అవకాశం కలిగినప్పుడు తమ వివాహ విషయం మాట్లాడాలని చెప్పాడు ప్రసాద్‌కు. ఇప్పుడు ఉద్యోగం లభించడంతో, యిక పెళ్ళికి ఆటంకంలేదనే వుద్దేశంతో, రాజు తననా విషయాలు మాట్లాడటానికి రమ్మనటం కొంత సంతోషం కలిగించింది. రాజుకు తనంటే అంతటి గౌరవమా ?" అని గర్వపడ్డాడు లోలోపల. మనస్సులో వూహలు తెగక పోయినా, నడవవలసిన దూరం తరగకుండా వుండదు గదా ! గమ్యస్థానం చేరారు యిద్దరూ.

చూడటానికి ముచ్చటగావున్న ఆ యిల్లు, యింటి అలంకరణా ప్రసాద్‌కు ఆనందం కలిగించినయ్. చిన్నదైనా, పొందికగా తీర్చిదిద్దినట్లుందా యిల్లు. ఇల్లు చూసి యిల్లాల్ని చూడమన్న సామెత గుర్తుకొచ్చి తనలో తనే చిరునవ్వు నవ్వుకున్నాడు ప్రసాద్.

వరండాలో కుర్చీల్లో కూర్చున్నారు ప్రసాద్, రాజు. లోపల్నుంచి షుమారు అరవైయేళ్ళ వృద్ధ స్త్రీ వరండాలో కొచ్చింది వీళ్ళనుచూసి. ప్రసాద్ లేచి నిల్చున్నాడు మర్యాదగా.

"ఫర్వాలేదు కూర్చో నాయనా. ఏం బాబూ రాజూ. చాలా రోజులైంది మా యింటివైపొచ్చి" అని యెదురు బల్లమీద కూర్చుంటూ "వీరెవరు ?" అన్నది ప్రసాద్ వైపు చూపిస్తూ.

"నా స్నేహితుడు ప్రసాద్. మీకు చెప్పినే అతనే. ఆఁ అన్నట్లు అసలు విషయం, నాకు ఉద్యోగం దొరికింది. ఈవేళే ప్రవేశించాలి. చెప్పిపోదామని వచ్చాను" ఆనందాన్ని తమాయించుకుంటూ చెప్పి, లోపలి గదిలోకి చూపులు సారించాడు రాజు.

ముసలావిడ ముఖం చాటంత చేసుకుని "అమ్మాయ్, అమ్మాయ్. రాజు వచ్చాడమ్మా.... రా" అని లోపలికి పిలిచింది పెద్దగా.

కొంగుకు చేతులు తుడుచుకుంటూ, సంతోషంగా బయటకు రాబోయి, మరో వ్యక్తి అక్కడ వుండటం గమనించి తలుపుచాటున నుంచుంది కుమారి.

ముసలావిడ ముసి ముసి నవ్వుకుని "మా అమ్మాయికి తగని బిడియం లెండి. ఆఁ అన్నట్లు నామతి మండిపోను.... అమ్మాయ్.... ఆ ఫ్లాస్క్‌లో కాఫీ పట్రామ్మా" అన్నది కూతుర్ని ఆజ్ఞాపిస్తూన్నట్లు.

"అహఁహ ఇప్పుడే తీసుకొచ్చాం లెండి అక్కర్లేదు కుమారీ" అన్నాడు రాజు లోపలికి వెళ్తున్న కుమారిని వారిస్తూ. కాని ఆమె అప్పటికే లోపలికి వెళ్ళిపోయింది ఆ ప్రయత్నంమీద.

ప్రసాద్‌కు మౌనం ధరించటం కష్టంగా వుంది.

"ఆఁ ఏమండీ రాజుకు వుద్యోగం దొరికింది. వాళ్ళమ్మ వీడి పెళ్ళిచేసి కోడల్ని చూడాలని వుబలాటపడుతున్నది. ఏదో.... పిల్లవాడికి నచ్చితే ఎవరి ఆటంకాలూ లేవు...." ఉపోద్ఘాతంగా మొదలెట్టాడు ప్రసాద్. కాని యిలాంటి విషయాల్లో తన తెలివి తక్కువతనం మాటల్లో దాచిపెట్టుకోలేకపోయానే అనిపించింది అతనికే. సిగ్గుపడితలవంచుకున్నాడు.

"ఆహాఁ అంతకంటేనా బంగారంలాంటి కుర్రాడు. నేనేం చెప్పగలను చెప్పండి. ఇదంతా మా అమ్మాయ్ అదృష్టం అని "అమ్మాయ్ కుమారీ ఇలా రామ్మా వారుకూడా చూస్తారు...." అంది లోపలికిచూస్తూ.

రెండు చేతుల్తో కాఫీ కప్పులు తెచ్చి బల్లమీద పెట్టి, తలవంచుకు నిలబడ్డది కుమారి. అప్పటికే ఆమె కుడి కాలిబొటన వ్రేలు నేలమీద ఏన్నో అక్షరాలుదిద్దుకుంది. అలాగే వోణీ చెరుగు ఆమె పండ్లకు చిక్కి చాలా మెలికలు తిరిగింది. ఇంతలో

(తరువాయి 25వ పేజీలో)

# రాగజ్యోతి

(8వ పేజీ తరువాయి)

"అంత సిగ్గయితే యెలానే" అంది ముసలావిడ.

ఈ మాటకు ఆమె తల యెత్తుతుందని వూహించి, తనూ కొంచెం దృష్టిపైకి సారించాడు ప్రసాద్. కుమారి ముంచుకొచ్చే సిగ్గును ప్రక్కకునెట్టి చూపులు పైకి నిలిపింది.

పరీక్షగా చూశాడు ప్రసాద్. పరికించి చూసింది కుమారి.

నిశ్చేష్టురాలైంది ఆమె. నిశ్చేష్టుడైనాడు అతను.

ఆనందంతో మాటలు పెగల్లేదు యిద్దరికీ!

దుఃఖంతో కంఠం బొంగురు పోయింది యిద్దరికీ!

పెన్నిధిని గన్న పేదవాడైనాడు ప్రసాద్. కళ్ళలో ఆనంద దుఃఖాలు మిళితమైన అశ్రువులు నిండి నిలబడ్డయ్. ఏదో మాట్లాడాలనుకున్న అతని నాలుక అలాగే ముడ్డకట్టుకుపోయింది.

క్షణకాలంలో అనేక భావ సంఘర్షణలకులోనైన ప్రసాద్, కుమారిలను చూసి ఏమీ అర్థంకాలేదు ముసలమ్మకూ, రాజుకూ.

"ఏమిటి ప్రసాద్" నెమ్మదిగా పలకరించాడు రాజు.

భావసమాధిలో నుంచీ తేరుకుని "అరుణా!" అని. పిచ్చివాడులా కేకేసాడు

వెక్కి వెక్కి ఏడుస్తున్నది అరుణ.

మూగవాడైపోయాడు రాజు. అతని హృదయ వీణా తంత్రులొక్కసారిగా తెగిపోయినయ్.

ముసలమ్మ కిదంతా అయోమయంగా వుంది. ప్రసాద్, అరుణా కూర్చున్నారు. కొన్ని క్షణాలు గడిచినయ్.

"ఈవిడే నన్ను కాపాడిన దేవత. మా అమ్మ. ఇంటి నుంచి వెళ్ళిన తర్వాత...." అంటూ తన కథ చెప్తున్నది అరుణ ప్రసాద్ కు.

రాజు ఎప్పుడు లేచి వెళ్ళాడో యెవరూ గమనించలేదు!

5

హృదయంలో కోటి ఆశాసుమాల్ని చిగురింపజేసుకుని, గుండెలపై బెట్టిన భారాన్ని తొలగించుకుని, సంతతొంతరంగంతో గదికి చేరాడు ప్రసాద్. రాజు వచ్చి వుంటాడన్న అతని వూహ తప్పైంది. అతనికి మారుగా టేబిల్ మీద ఉత్తరం! తీసి చదివాడు.

ప్రసాద్,

ప్రాణస్నేహితులమైన మన జీవితాల్లో ఈ అపూర్వ సంఘటన మరపురానిది. మొదటినుంచి అరుణకోసం తపించిపోయే నీ హృదయపులోతు తెలిసిన, నాకు యీనాడెమెను కోరే హక్కులేదు హక్కుల సంగతెలా వున్నా. అంతటి కృతఘ్నతకు నా మనస్సు అంగీకరించదు. మీ యిరువురి అనురాగలతా చిన్ననాటి నుంచీ పెరిగి పెద్దదై యీనాడు పరస్పరాధారంతో పుష్పించింది. మీ యిరువురి హృదయాలలో దివ్యతేజంతో వెలిగే రాగజ్యోతిని ఆర్పే శక్తి నాకు లేదు. ధర్మాధర్మ విచక్షణకంటే, నా అసమర్థతే నన్నీ నిర్ణయానికి తెచ్చింది. సరే.... మధ్యలో వచ్చిన వాణ్ణి మధ్యలోనే వెళ్ళిపోతున్నాను. ఎరుగక చేసిన నా ద్రోహాన్ని, మన్నిస్తావనే నమ్మకంతో, స్నేహితుడుగా నన్ను గుర్తుంచుకోమని వేడుకుంటూ సెలవు తీసుకుంటున్నాను. క్షమించు. రాజు"

తను నిలబడిన స్థలమంతా పాతాళానికి దిగపోతున్నట్లయింది ప్రసాద్ కు. చెంపన ఎవరో ఛెళ్లున కొట్టినట్లయి, చేత్తో ఎడమ కణతను పట్టుకున్నాడు.

"రాజూ.... ఎంత పని చేశావ్ రాజూ ఎంత తొందరపడ్డావ్" అంటూ తనలో తనే గొణుక్కుంటూ బయటపడ్డాడు.

బరువెక్కిన హృదయంతో, భారంగా కాళ్ళీడుస్తూ అరుణ యింటికి చేరాడు ప్రసాద్. వరండాలో దృశ్యంచూసి అతని కళ్ళు తృప్తిగా మెరిసినయ్. కుర్చీలో కూర్చుని వున్నాడు రాజు.

"చివరిసారిగా కుమారికికూడా చెప్పిపోదామని వచ్చాను" అన్న రాజు మాటల్ని విన్నాడు ప్రసాద్.

ప్రసాద్ రావటం చూసి లేచి నిలబడ్డాడు రాజు.

"రాజూ.... రాజూ.... ఎంత పొరపడ్డావ్ రాజూ...." అంటూ రాజు భుజాలు పట్టుకుని "నాతో యింతకాలం కలిసిమెలిసి వుండి నన్నర్థం చేసుకున్న దింతేనా రాజూ...." అంటూ కుర్చీలో కుప్పకూలిపోయాడు ప్రసాద్.

రాజు ముఖం దించుకుని కూర్చున్నాడు. అతని హృదయం రగిలిపోతుంది. కుమారితో తన ప్రణయం, ప్రసాద్ తో తన స్నేహం రెండూ భగ్నమైపోయినయ్. తానొం భగ్నజీవి "తనిక జీవించి ప్రయోజనమేమిటి?" సమాధానం దొరకలేదు రాజుకు.

"ఇంతకీ ఏం జరిగిందబ్బాయిలూ...." అన్నది ముసలావిడ యిద్దర్నీ ఉద్దేశించి. కాని జవాబులేదు. అంతలోనే

"వచ్చావామ్మా.... అరుణా.... అంతా అగమ్యగోచరంగా వుంది.... నీ కోసమే చూస్తున్నాం.... రా...." అన్నది ఆవిడే ఎదురుగా వస్తున్న అరుణతో.

చేతిలో పొట్లాలు బల్లమీదపెట్టి "ఏం జరిగిందమ్మా...." అన్నది ఆతృతగా.... తల్లి ప్రసాద్ రాజుల్నిద్దరిని చూపింది చేతులతో....

"ఏం జరిగిందండి?" ఈ ప్రశ్న రాజు నుద్దేశించిందయినా అతనుమాత్రం ఉలకలేదు, పలకలేదు. అరుణకు మనస్సులో ఆందోళన హెచ్చుతున్నది వారి నిశ్శబ్దాన్ని చూసి.

(తరువాయి 28వ పేజీలో)

## రాగజ్యోతి

(25 వ పేజీ తరువాయి)

" ఏం జరిగిందన్నయ్యా.... మవ్వైనా చెప్పు " అన్నది ప్రాధేయ పూర్వకంగా..

రాజు తలెత్తాడు.... ప్రసాద్ అరుణ వంక చూశాడు. అతని చూపుల్లో ఆవేదన వ్యక్తమౌతున్నది.
రాజు ఆశ్చర్య పోయాడు.

" అన్నయ్యా !...." దిగ్భ్రాంతి చెంది. అరుణనూ, ప్రసాద్‌నూ చూశాడు రాజు.. సిగ్గుతో కుంచించుకు పోయాడతను.

నైర్మల్యం తొణికిసలాడే వారి చూపు లకు పట్టుకోలేక, తలదించుకుని....

" ప్రసాద్.... ఎంత పొరపడ్డాను.... మహాపరాధంచేశాను ప్రసాద్.... క్షమించు ప్రసాద్... క్షమించు.... " అని ప్రసాద్ చేతులు పుచ్చుకుని పసిపిల్లవాడిలా బావురు మన్నాడు రాజు....

రాజు పశ్చాత్తాప అశ్రుధారలతో తడిసిన చేతుల్ని తీసుకుంటూ అతని భుజం తడివి " లే రాజూ... లే..." అన్నాడు ప్రసాద్.

"ఏమిటిదంతా..." అన్నది అరుణ.

"ఏంలేదులేమ్మా... చిన్న తొందర పాటు... అంతే.... అన్నాడు ప్రసాద్. అయినా ఆమెకూ, ముసలావిడకూ యిదేమీ అంతు పట్టక అలాగే చూస్తూ వుండి పోయారు...

"నీవు వెలిగించు అనురాగజ్యోతి కాంతి వెదజల్లి వెలిగించు కాంతి...." సినిమా బండిలో రికార్డు పాడుతూ ఆ యింటిని దాటి పోతున్నది.......

---

## నేనుచదివిన కొత్తపుస్తకం

(26 వ పేజీ తరువాయి)

ఈ సంపుటిలో పాఠకలోకానికి పరిచయ మౌతున్న వర్ధమాన రచయితలు మరింత శ్రద్ధగా సాహిత్య వ్యవసాయానికి పూను కుంటే బంగారు పంటలు పండించగలరు. అంతకంటే ఆశించదగిన దేముంటుంది?

మణిమంజీరాలు (పదికథల సంపుటి)

సంకలనం: కె. ఆర్. కె. మోహన్

శ్రీముఖ పబ్లికేషన్స్, ఖొజ్జిల్లిపేట, బందరు

పేజీలు 175 మూల్యం 2-50

—" రాజా "

---

## రెండు ఉత్తమ సావనీర్లు

రాష్ట్రంలోవున్న ఆంధ్రులకన్నా ఇతర రాష్ట్రాలలో, కలకతా, ఢిల్లీవంటి నగరాలలో ఉద్యోగరీత్యా స్థిరపడిపోయిన ఆంధ్రులకు రాష్ట్రాభిమానం చాల ఎక్కువ. కార్యదీక్షకు లోటూ లేదు వారు చేస్తున్న కృషి చూస్తుంటే ఈ విషయం స్పష్టమవుతుంది కలకత్తా ఆంధ్ర సంఘం, కలకత్తా ఆంధ్ర సాహిత్య పరిషత్ కార్య కలాపాలు తెలుసుకుంటుంటే, మన రాష్ట్ర సంస్కృతీ రాయబారులుగా ఈసంస్థలు ఈ వ్యక్తులు చేస్తున్న కృషి మనను పులకరింపజేస్తుంది.

సావనీర్ తీసుకురావాలని ప్రతి సంఘానికీ వుంటుంది. కానీ సావనీర్ ను సర్వాంగ సుందరంగా, విషయబోధకంగా, విజ్ఞానదాయకంగా తీసుకురావడం చాల కష్టం. కాని కలకత్తా ఆంధ్ర సాహిత్య పరిషత్, కలకత్తా ఆంధ్ర సంఘం రెండూ చాల చక్కని సావనీర్లు తీసుకువచ్చాయి.

కలకత్తా ఆంధ్ర సాహిత్య పరిషత్తు సావనీర్ సంపాదకులు శ్రీ పి. యు. సి. చౌదరి. ఈ సంచికలో ఇంగ్లీష్, తెలుగు, బెంగాలీ విభాగాలున్నాయి. ఇంగ్లీష్ విభాగంలో జాతీయ సమైక్యతకు ఒకే లిపి వుండడం దోహదం చేస్తుందని శ్రీ యం. కె. బెనర్జీ వ్రాసిన వ్యాసం, విశ్వనాథ శ్రీ శ్రీ మున్నగు వారి కవితల ఆంగ్లానువాదం, గురజాడపై యస్వీ జోగారావుగారి రచన అరుణాచలం గురించి కపిల కాశీపతిగారి వ్యాసం తెలుగు కవిత్వంలో అధివాస్తవికతపై అమరేంద్ర వ్రాసిన వ్యాసం, జాన్‌స్టెన్ బెక్ మీద శ్రీ యాజులు వ్రాసిన వ్యాసం. అమరావతి, నాగార్జున కొండపై ఎ. వి. నరసింహమూర్తిగారు వ్రాసిన వ్యాసాలు సావనీర్‌కు విశిష్టత కలిగించాయి

బెంగాలీ విభాగంలో బొమ్మన విశ్వనాధంగారు స్వర్గీయ శ్రీదేవి కథ అనువదించారు.

తెలుగు విభాగంలో, నారాయణరెడ్డి, బండవల్లి లక్ష్మీరంజను, పెన్మెత్స సత్యనారాయణరాజు, పుట్టపర్తి, ఆచంట జానకిరామ్, సోమంచి యజ్ఞన్నశాస్త్రి వంటి ప్రముఖుల రచనలున్నాయి

కలకత్తా ఆంధ్ర సంఘం వెలువరించిన సావనీర్‌కు సంపాదకులు డా॥ సి రాధాకృష్ణ రాక, మెట్టా ఆంజనేయులు, రవీంద్రనాద్ పారనంది, కృష్ణగిరి సి. శేషగిరి రావుగార్లు

ఈ సంచికలోకూడ బెంగాలీ, ఇంగ్లీష్ తెలుగు విభాగాలున్నాయి. విషయ బాహుళ్యంలో కాని, అలంకరణలో కాని మొదటిదానికి యిది ఏ విధంగానూ తీసిపోదు. ఇంగ్లీష్ విభాగంలో ప్రస్తుత పరిస్థితిపై యం. వెంకట రంగయ్యగారి సమీక్ష. హిందీ సాహిత్యానికి ఆంధ్రులు చేసిన సేవవిషయమై డా॥ ఐ పాండురంగారావుగారి వ్యాసం. ఇంకా ఎన్నో రచనలు ఉత్తమశ్రేణికి చెందినవిగా వున్నాయి.

తెలుగు విభాగంలో గొల్లపూడి మారుతీరావు, కాళ్ళూరు నాగేశ్వరరావు, ఆదివిష్ణు ధనిష్ట, మెట్టా అంజనేయులు, పమిడి ముక్కల లక్షణరావుగార్ల కథలు, ఇంకా అనేక రచనలున్నాయి.

ఆంధ్ర సంఘం సభ్యుల చిరునామాలు చివరన యిచ్చారు.

అత్యుత్తమ శ్రేణికి చెందిన ఈరెండు 'సావనీర్లు' ఏసంఘానికయినా గర్వకారణమైనవి. — కె. వి.